



సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి కొండపల్లి

జీవితంలో భాగంగా ఏఐ

- ప్రతి ఇన్నోవేషన్‌కు గుర్తింపు... ప్రతిభతోనే పరిష్కారాలు
- ఫ్యూజన్ ఏఐ సదస్సులో ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

.....8వ పేజీలో

పేదల సొంతింటి కల సాకారం!

ప్రభుత్వ అదనపు సాయంతో గృహ నిర్మాణాలు వేగవంతం

- తొలి దశలో 5,797 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారులు ఆనందం



కె.కోటపాడు మండలం కింతాడలో చురుగ్గా సాగుతున్న గృహ నిర్మాణ పనులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా నిలిచిన పేదల గృహ నిర్మాణాలకు అదనపు సాయం అందించి పూర్తి చేయాలని నిర్ణయించింది. వైసీపీ అధికారంలో వున్నప్పుడు పేదలకు ఇళ్ల నిర్మాణాల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి ఇచ్చిన రూ.1.8 లక్షలు మినహా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఒక్క రూపాయి కూడా లబ్ధిదారులకు అందించలేదు. పైగా సిమెంట్, ఇటుకలు, ఇసుక, ఇతరత్రా నిర్మాణ సామాగ్రి సరఫరా పేరుతో వైసీపీ నాయకులే బినామీ కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి లబ్ధిదారుల సొమ్మును స్వాహా చేసినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో జిల్లాలో 704 లేఅవుట్‌లకుగాను సగం లేఅవుట్‌లలోఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణాలు పడకేశాయి. ఫలితంగా పేదల సొంతింటి కల నెరవేరలేదు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా వున్న ఇళ్ల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసుకొనేందుకు ముందుకొచ్చింది. ఇందుకోసం అదనంగా ఆర్థిక సాయం ప్రకటించింది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు.

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో సుమారు 2,464 ఎకరాల్లో 704 లేఅవుట్‌లు వేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని 65,800 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. అయితే కొన్ని గ్రామాల్లో కొండలు, గుట్టలు వున్నచోట లేఅవుట్లు వేయడంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. ఐదేళ్లలో వివిధ కారణాల వల్ల 12 వేల గృహ నిర్మాణాలు మాత్రమే పూర్తి చేశారు. మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయాయి. గత ప్రభుత్వం అదనంగా ఎటువంటి ఆర్థిక సాయం చేయకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశారు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసేందుకు సర్వే చేయించింది. 50 శాతానికిపైగా నిర్మాణ పనులు పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు సాయం ప్రకటించింది. గతంలో మంజూరైన రూ.1.8 లక్షలతోపాటు ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల చొప్పన సాయం అందజేసింది. జిల్లాలో తొలి విడత 4,524 మంది బీసీ, 1,021 ఎస్సీ, 252 మంది ఎస్టీ లబ్ధిదారులు.. మొత్తం 5,797 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొనేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది మార్చిలో రూ.6.5 కోట్లు విడుదల చేస్తూ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనకాపల్లి నియోజకవర్గంలో 600 మంది, చోడవరంలో 753 మంది, మాడుగులలో 789 మంది, నర్సీపట్నంలో 1,062 మంది, పాయకరావుపేటలో 1,384 మంది, పెందుర్తిలో 476 మంది, ఎలమంచిలిలో 733 మందికి అదనపు సాయం మంజూరవడంతో ఇళ్ల నిర్మాణ పనులను పునరుద్ధరించారు. ఇళ్ల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుండడంతో ఆయా వర్గాల లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. తొలి దశలో నిధులు మంజూరు చేసిన ఇళ్లను పూర్తి చేయగానే, మిగిలిన వాటిలో మరికొన్ని ఇళ్లకు అదనపు సాయం నిధులు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు.

శరవేగంగా..

అనకాపల్లి-అచ్యుతాపురం నాలుగు లేన్ల రోడ్డు పనులు ముమ్మరం

- అచ్యుతాపురం జంక్షన్‌లో చురుగ్గా ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం
- తుది దశలో కొత్త వంతెనలు, కల్వర్టుల పనులు
- ప్రభుత్వ స్థలాల్లో ఊపందుకున్న రోడ్డు విస్తరణ
- నిర్వాసితులకు టీడీఆర్ బాండ్ల పంపిణీ ప్రారంభం
- కట్టడాలకు నగదు రూపంలో నష్టపరిహారం
- రోడ్డు విస్తరణతో తీరనున్న ట్రాఫిక్ సమస్య



అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి వద్ద పూడిమడక జంక్షన్ నుంచి మునగపాక మీదుగా అచ్యుతాపురం వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులు ఊపందుకున్నాయి. అచ్యుతాపురం జంక్షన్‌లో ఇప్పటికే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం ప్రారంభం అయ్యింది. మునగపాక, అచ్యుతాపురం మండలాల్లో పలుచోట్ల వంతెనలు, కల్వర్టుల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. వంతెనలకు ఇరువైపులా అప్రోచ్ రోడ్ల ఏర్పాటు పనులు కొద్ది రోజుల్లో మొదలు కానున్నాయి. రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు వున్నచోట విస్తరణ పనులు గతంలోనే ప్రారంభం అయ్యాయి. ఇప్పుడు జిరాయితీ స్థలాలకు టీడీఆర్‌లు, కట్టడాలకు నగదు రూపంలో నష్టపరిహారం చెల్లిస్తుండడంతో రహదారి విస్తరణ పనులు మరింత ఊపందుకోనున్నాయి.

ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా మారిన రోడ్లు.. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత శరవేగంగా రూపురేఖలు మారిపోతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలల్లోనే రహదారులపై గోతులు పూడ్చివేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పలుచోట్ల రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డును విస్తరిస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సర్వే చేయించి, డీపీఆర్ తయారు చేయించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతోపాటు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.347 కోట్ల రుణం మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్ దక్కించుకుంది. 13.8 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులకు ఈ ఏడాది మార్చి 31వ తేదీన మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. నాలుగు లేన్లతో వంద అడుగుల వెడల్పున అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు నిర్మిస్తున్నారు. అచ్యుతాపురం జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ వంతెనతోపాటు మూడు ప్రధాన వంతెనలు, 47 కల్వర్టులు నిర్మించనున్నారు. ఫ్లైఓవర్ వంతెన పనులు చకచకా సాగుతున్నాయి. అచ్యుతాపురం మండలం హరిపాలెం, కొండకర్ల ఆవ, చోడపల్లి పరిసరాల్లో రోడ్డు విస్తరణ, కల్వర్టుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ భూముల్లో రహదారి విస్తరణ పనులు చేపట్టారు.

నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు

రోడ్డు విస్తరణ కోసం స్థలాలు, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంగా నగదు బదులు ట్రాన్స్‌ఫర్‌బుల్ డవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లు ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. టీడీఆర్ బాండ్లు వద్దని, నగదు మాత్రమే ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. తరువాత రెవెన్యూ అధికారులు ... మిగతా 8వ పేజీలో



అచ్యుతాపురం-మునగపాక మధ్య సాగుతున్న రహదారి విస్తరణ పనులు

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు శనివారం జరగనున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశం ఒకేరోజు (ఈ నెల తొమ్మిదో తేదీన) ఏర్పాటుచేయగా సభ్యులు అభ్యంతరం తెలిపారు. దాంతో స్టాండింగ్ కమిటీ సమావేశాలను 26వ తేదీకి వాయిదావేశారు. ఇదిలావుండగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర (వైసీపీ)తో విభేదాల కారణంగా ఆరోజు సర్వసభ్య సమావేశానికి కూడా సొంత పక్షానికి చెందిన సభ్యులు సగానికిపైగా హాజరుకాలేదు. ఆ తరువాత శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ వద్ద పంచాయితీ జరిగింది. వివాదానికి తెరదించాలని నేతలు సూచించడంతో జడ్పీటీసీ సభ్యులు తాత్కాలికంగా అంగీకరించారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాలకు సభ్యులు హాజరయ్యే అవకాశం ఉందని కొందరు వెల్లడించారు. అయితే జడ్పీలో కొందరు ఉద్యోగుల అవినీతిని ప్రశ్నించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఏమి జరుగుతుందో చూడాలి.

రూ.500 కోట్లతో దేవాలయాల పునర్నిర్మాణం

- ఆలయాలన్నింటికీ పాలక మండళ్లను నియమిస్తాం
- ఇన్‌చార్జుల పాలనకు త్వరలో స్వస్తి
- దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

- 8లో

పట్టాలెక్కనున్న మెట్రో రైలు ప్రాజెక్టు

టెండర్‌ల ఆహ్వానం

- డబుల్ డెక్కర్ మోడల్... నాలుగు వరుసల ఫ్లైఓవర్
- 3 కారిడార్లు...46.23 కి.మీ. పొడవు
- 42 ఎలివేటెడ్ స్టేషన్లు
- అంచనా వ్యయం రూ.6,250 కోట్లు
- 30 నెలల్లో మొత్తం పూర్తి...
- 24 నెలల్లో 20.16 కి.మీ.ల డబుల్ డెక్కర్ నిర్మాణం పూర్తి చేయాలని షరతు
- సెప్టెంబరు 12న బిడ్లు ఓపెన్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ శుక్రవారం టెండర్ విడుదల చేసింది. దీనికి అంతర్జాతీయ స్థాయిలో బిడ్డర్లను ఆహ్వానించింది. కాంట్రాక్టు దక్కించుకునే సంస్థే దీనికి ఇంజనీరింగ్, డిజైన్, నిర్మాణ బాధ్యతలు చూసుకోవలసి ఉంటుంది. ముందు నుంచి అనుకుంటున్నట్టుగానే తొలి దశలో స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు మెట్రో కారిడార్‌ను 46.23 కి.మీ. పొడవున నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో మూడు కారిడార్లు ఉంటాయి. అందులో 20.16 కి.మీ. మేర డబుల్ డెక్కర్ విధానంలో నాలుగు వరుసల ఫ్లైఓవర్ నిర్మాణం ... మిగతా 8వ పేజీలో

ఇదీ కారిడార్ల తీరు

- మొత్తం మెట్రో రైలు కారిడార్ పొడవు 46.23 కి.మీ.
- స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు 34.41 కి.మీ. ఒక కారిడార్ వస్తుంది. ఇందులోనే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ఉంటుంది. దీని పరిధిలో 29 స్టేషన్లు వస్తాయి.
- గురుద్వారా నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5.07 కి.మీ. పొడవున రెండో కారిడార్ వస్తుంది. ఈ మార్గంలో ఆరు స్టేషన్లు ఉంటాయి.
- తాటిచెట్లపాలెం నుంచి చిన్నవాల్తేరు వరకు 6.75 కి.మీ. మూడో కారిడార్ ఉంటుంది. ఇందులో ఏడు స్టేషన్లు వస్తాయి.

9 ఎకరాల డి.పట్టాలు రద్దు

- నిబంధనలు ఉల్లంఘించిన లబ్ధిదారులు
- ఎన్‌ఓసీ పొందకుండా క్రయవిక్రయాలు
- భూమిని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

సబ్బవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని వెదుళ్లనరవ, గంగవరం గ్రామాల్లో నిబంధనలు ఉల్లఘించి, క్రయవిక్రయాలు జరిపిన తొమ్మిది ఎకరాలకు సంబంధించిన డి.పట్టాలను తహశీల్దార్ శుక్రవారం రద్దు చేశారు. దీంతో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో వినోద్ శుక్రవారం సంబంధిత భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఆర్ఐ వీరయ్య తెలిపిన వివరాలిలా వున్నాయి.

వెదుళ్లనరవ సర్వే నంబరు 94/3లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో ఓ వ్యక్తికి ప్రభుత్వం పంపిణీ చేసి డి.పట్టా ఇచ్చింది. కొంత కాలం వ్యవసాయం చేసిన తరువాత సదరు రైతు డి.పట్టా నిబంధనలు తుంగలో తొక్కి దుర్వినియోగానికి పాల్పడ్డారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు 15 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. డీ పట్టా ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపిన తహశీల్దార్ బి.చిన్నికృష్ణ.. పివోటీ చట్టం-1977 ప్రకారం సదరు రైతుకు ఇచ్చిన డి.పట్టాను రద్దు చేశారు. అదే విధంగా డి.పట్టా నిబంధనలను ఉల్లంఘించినందుకు గంగవరం సర్వే నంబరు 38/3లో నాలుగు ఎకరాలకు గతంలో జారీ చేసిన డి.పట్టాను కూడా రద్దు చేసి, ఈ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



గంగవరం సర్వే నంబరు 38/3లోని డి.పట్టా భూమిలో ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డు

సాఫీగా సాగునీరు

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

- తాండవ ఆయకట్టుకు ఎనిమిది నుంచి నీరు విడుదల
- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాగునీటి పారుదల సలహా మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ జలాశయాల నుంచి సాగునీరు విడుదల చేసేందుకు తేదీలను ఖరారు చేశామని పేర్కొన్నారు. రిజర్వాయర్ల నుంచి నీటి వృథాను అరికట్టడంతోపాటు ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కోనాం, పెద్దేరు జలాశయాల నుంచి శుక్రవారం నీటిని విడుదల చేయగా, ఈ నెల 29న రైవాడ జలాశయం నుంచి, ఆగస్టు 8న తాండవ జలాశయం, 12న కల్యాణపులోవ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు.



పెద్దేరు జలాశయం వద్ద నీటి విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు

పెద్దేరు, కోనాం ఆయకట్టుకు నీరు విడుదల

మాడుగుల/ చీడికాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మండలం పెద్దేరు, చీడికాడ మండలం కోనాం జలాశయాల నుంచి కాలువలకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం గేట్లు ఎత్తి కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పెద్దేరు జలాశయం వద్ద ఆయన మాట్లాడుతూ, కాలువల ఆధునీకీకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.69 కోట్లు మంజూరు చేసిందని, ఖరీఫ్ సీజన్ ముగిసేలోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, కాలువలకు నీటి విడుదల ఆపేసిన అనంతరం డిసెంబరులో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఖరీఫ్‌నాటికి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. ఆయకట్టుకు ఏటా రెండు పంటలకు నీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

నాగందొరపాలెం-ఎర్రవరం మధ్య కూలిన మదుం

- రోడ్డు మధ్యలో భారీ గొయ్యి
- రక్షణ చర్యలు చేపట్టని పీఆర్ అధికారులు
- ప్రమాదాలబారిన వాహనదారులు

గొలుగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని పుత్తడిగైరంపేట పంచాయతీలోని నాగందొరపాలెం-ఎర్రవరం గ్రామాల మధ్యలో మదుం శిథిలావస్థకు చేరి, మధ్యలో కొంతభాగం కూలిపోయింది. వాస్తవంగా మూడేళ్ల క్రితం చిన్నపాటి రధ్రం ఏర్పడగా.. పంచాయతీ రాజ్ అధికారులు మరమ్మతులు చేయించలేదు. దీంతో క్రమేపీ రధ్రం పెద్దగామారి ఇటీవల రోడ్డు మధ్యలో కూలిపోయింది. అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు ద్వారా పీఎస్‌డీ పాలెం, పెసరాడ, సుద్దలపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త మదుము నిర్మించాలని వారు కోరుతున్నారు. దీనిపై పీఆర్ డీఈ ఈశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. నూతనం మదుం నిర్మాణానికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతులు లభించిన వెంటనే పనులు చేపడతామని చెప్పారు.



మదుం కూలిపోవడంతో రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గొయ్యి

నాబార్డు నిధులతో గ్రామీణ రోడ్ల అభివృద్ధి

- పరవాడ మండలంలో మూడు ప్రధాన రహదారులకు రూ.2.2 కోట్లు మంజూరు
- నేడు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే పంచకర్ల

- 8లో



రాళ్లు తేలి అధ్వానంగా తయారైన స్వయంభూవరం - సోమినాయుడుపాలెం రహదారి

రోగులకు మెరుగైన వైద్య సేవలు

▸▸ మునగపాక పీహెచ్‌సీ సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచన


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

మునగపాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత అంకితభావంతో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ హైమావతి సూచించారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందులు అందుబాటులో ఉంచడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.విమలగిరి, సీహెచ్‌వో దేవకాంతలకు పలు సూచనలు చేశారు.

ఐదుగురు నిర్వాసితులకు పరిహారం పంపిణీ

అచ్యుతాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు రెట్టింపు పరిహారం ఇస్తున్నామని ఆర్డీవో ఆయిషా తెలిపారు. శుక్రవారం హరిపాపాలేనికి చెందిన ఐదుగురు నిర్వాసితులకు పరిహారపు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ చెక్‌ల ద్వారా నిర్వాసితుల ఖాతాలకు వెంటనే నగదు జమ అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, డీటీ శ్యామ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈ పద్మిని పాల్గొన్నారు.

పీ-4తో పేదల బతుకుల్లో వెలుగులు

▸▸ ఈ బృహత్కార్యం విజయవంతం అందరి బాధ్యత ▸▸ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్


పీ-4 యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో సమీక్ష జరుపుకుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ-4)ను నియోజకవర్గంలో విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పీ-4 సర్వే యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ప్రగతి పథాన నడపాలన్న సంకల్పంతో ఈ బృహత్కార్యాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. ఇందులో ప్రైవేటు సంస్థలు భాగస్వామ్యం కావాలన్నారు. కొన్ని కుటుంబాలకు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, నియోజకవర్గ స్థాయి అధికారులు చేయూతనందించేలా ముందుకు రావాలని సూచించారు. సచివాలయాల పరిధిలోని ప్రతి ఒక్కరి సమాచారం అధికారుల వద్ద ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కొండలరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే జడ్పీ అతిథి గృహంలో పశువైద్య శాఖ వైద్యులతో సమావేశం నిర్వహించారు. పాడి సంపదను వృద్ధి చేసేందుకు రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం పలు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ఆర్అండ్‌బీ స్థలంలో నిర్మాణాలకూ రెట్టింపు పరిహారం'

మునగపాక : కూటమి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక మానవత్వం మిళితమై ఉంటుందని, ఇందులో భాగంగానే అర్అండ్‌బీ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలకు కూడా రెట్టింపు పరిహారం ఇస్తున్నామని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అప్రోచ్‌రోడ్డు నిర్వాసితులకు చెక్కుల రూపంలో పరిహారాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. వాస్తవానికి ఆర్అండ్‌బీ స్థలంలో ఉన్న నిర్మాణాలకు ఎటువంటి పరిహారం ఇవ్వనవసరం లేకపోయినా ప్రభుత్వం మానవతా దృక్పథంతో నగదు ఇస్తోందన్నారు. అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా టీడీఆర్ బాండ్లు తీసుకునేందుకు ముందుకొస్తున్న వారిని ఒప్పుకో వద్దంటూ కొంతమంది ఒత్తిడి చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆయిషా, ఆర్అండ్‌బీ ఏఈ సుందరపు పద్మిని, తహశీల్దార్ పి.సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఉషారాణితో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు


దుర్గామాత ఆలయంలో భక్తుల పూజలు

ఎలమంచిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా మండలంలోని అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా పద్మనాభరాజుపేటలోని దుర్గామాత ఆలయంలో తొలుత అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సామూహిక కుంకుమార్చనకు పెద్దసంఖ్యలో మహిళలు తరలి వచ్చారు.

కృష్ణంపాలెం నిర్వాసితులను ఆదుకోవాలని ఆందోళన

రాంబిల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం ఎస్ఈజెడ్‌కు భూములిచ్చి నిర్వాసితులైన కృష్ణంపాలెం గ్రామస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సదరు గ్రామంలో నిర్వాశితులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2006లో ఈ పంచాయతీలోని భూములను ఎస్ఈజెడ్‌కు తీసుకుని ఎకరా భూమికి అతి తక్కువగా రూ.ఐదున్నర లక్షలు పరిహారంగా ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఈ రెవెన్యూలో తీసుకున్న భూములకు ప్రభుత్వం రూ.23 లక్షలు పరిహారం ఇస్తున్నందున అప్పటి రైతులకూ ఇదే విధంగా పరిహారం అందించాలన్నారు.గత ప్రభుత్వం హయాంలో పంచదార్ల రెవెన్యూలో 32.49 ఎకరాలు కేటాయించి జీవో ఇచ్చారని, నేడు ఈ ప్రభుత్వం అక్కడ కాలనీ నిర్మాణం అవ్వదని చెప్పడం బాధాకరమన్నారు.

28న టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకంగా పాదయాత్ర

మునగపాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు మద్దతుగా, టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదీన తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, బుద్ధ రంగారావు, సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

విజనరీ నేత చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి

▸▸ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ'


చిప్పాడ గ్రామంలో టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విజనరీ ఉన్న చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమప్రాధాన్యం ఇస్తూ చక్కని పాలన అందిస్తున్నారని రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. చిప్పాడ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పుల ఊబిగా మార్చిన రాష్ట్రాన్ని కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చంద్రబాబు గాడిలో పెట్టారన్నారు. ఇది చేతల ప్రభుత్వమని ఎల్లప్పుడూ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, నాయకులు దేశంశెట్టి వెంకట రమణ, రాజాన రామునాయుడు, లాలం శ్రీను, ధర్మిరెడ్డి నాయుడుబాబు, పతివాడ చిన్నయ్యనాయుడు, బి.ఎ. రమణ, లాలం రాములతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడివాడ గ్రామంలో...


మామిడివాడలో సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న భరత్

రాంబిల్లి : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు వంటి సమర్థమైన నాయకుడితోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు లాలం భరత్ అన్నారు. మండలంలోని మామిడివాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో సాధిస్తున్న విజయాలను వివరించారు. సమస్యలు తెలుసుకున్న అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరెడ్ల ఈశ్వరరావు, నాయకులు లాలం అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో వైసీపీకి పూర్వ వైభవమే లక్ష్యం కావాలి'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, చిత్రంలో కన్నబాబురాజు

ఎలమంచిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని ఎలమంచిలి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారన్నారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబు సహకారంతో వైసీపీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. సమష్టి కృషితో నియోజకవర్గంలో వైసీపీకి పూర్వ వైభవం తీసుకు రావాలని కోరారు. అంతకు ముందుకు మాజీ ఎమ్మెల్యే యు.విరమణమూర్తి రాజు, ఎంపీపీ బోదెపు గోవింద్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమష్టిగా ఉంటే సాధించలేనిది ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, నాయకులు బొద్దపు యర్రయ్యదొర, సంతోష్, వెంకట్, పిట్టా సత్తిబాబు, దూది నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానా'

అచ్యుతాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై జరిమానాలు విధించినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు జరుగుతున్నందున ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అయినప్పటికీ పలువురు భారీ వాహనచోదకులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీనిపై పలుమార్లు సూచించనప్పటికీ ఫలితం లేకపోవడంతో జరిమానాలు విధించామన్నారు. ఇకపై నిబంధనలు పాటించని వాహనాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఉప్పరాపల్లిలో టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటన

▸▸ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో తనిఖీలు


ఆరోగ్య మందిరంలో గర్భిణుల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరాపల్లి గ్రామంలో జిల్లా వైద్య, ఆరోగ్య టాస్క్‌ఫోర్స్ బృందం ప్రతినిధులు శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. బృందం ప్రతినిధులు ఎ.రామచంద్రరావు, కె.జగదీశ్, వై.జనార్ధన్ రికార్డులతో పాటు ఆన్‌లైన్‌లో హెచ్ఎంఐఎస్, ఆర్‌సీహెచ్‌కు చెందిన రిపోర్టులను తనిఖీ చేశారు. అంతేకాకుండా వైద్య, ఆరోగ్య సేవలు ఇక్కడ సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల్లో నమోదు చేసిన వివరాల ఆధారంగా గ్రామంలో గర్భిణులు, బాలింతలతో పాటు కౌమారదశ బాలికల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారితో మాట్లాడి వైద్య, ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడేను జిల్లా అధికారి రామచంద్రరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


దేవవరంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఎంపీడీవో డి.సీతారామరాజు శుక్రవారం తనిఖీ చేశారు. కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు ఉపయోగపడుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీడీవో చెప్పారు. పంట కుంటల నిర్మాణ పనులపై ఆరా తీయగా, కాలువల నిర్మాణ పనులు పూర్తయినట్టు కార్యదర్శి శ్రీనివాస్ చెప్పారు. అనంతరం దేవవరం, శివారు గ్రామమైన ఒడ్డిమెట్టలో పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదం

నర్సీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని చెప్పారు. గంజాయి సేవించినా, రవాణాకు పాల్పడినా జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు.

చినుకు పడితే చిత్తడే..

▸▸ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా రోజుల తరబడి మురుగు


▸▸ రాకపోకలకు వాహన చోదకులు, ప్రజల ఇబ్బందులు


మెయిన్ రోడ్డు పక్కన పేరుకుపోయిన బురద

పాయకరావుపేట మెయిన్ రోడ్డు చినుకు పడితే చిత్తడవుతోంది. రహదారికి ఇరువైపులా బురదమయమవుతోంది. రోజుల తరబడి నిల్వ ఉండిపోతూ మురుగు పేరుకుపోతోంది. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పాయకరావుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గోతులతో అధ్వానంగా ఉన్న పాయకరావుపేట మెయిన్ రోడ్డును రెండేళ్ల క్రితం అభివృద్ధి చేయడంతో సమస్య తొలగిందనుకున్న పట్టణ ప్రజలను వర్షాల సమయంలో రోడ్డు ఇరువైపులా బెర్మ్‌లు బురదగామాకి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పాయకరావుపేటలో తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు ఉన్న మెయిన్ రోడ్డును 2023లో సుమారు రూ.1.9 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులలో పునర్నిర్మించిన అధికారులు, రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి కాలువలు నిర్మించలేదు. పైగా పల్లపు ప్రాంతాలు ఎత్తుచేయకపోగా కనీసం వర్షం నీరు పోయేందుకు కచ్చా కాలువలు కూడా ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో వర్షాలకు పట్టణంలో గౌతమ్ సెంటర్, చిత్ర మందిర్ సెంటర్, పాత పంచాయతీ కార్యాలయం, మంగవరం రోడ్డు జంక్షన్, లక్ష్మి థియేటర్, గౌతమ్ మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లో మెయిన్ రోడ్డుకిరువైపులా మట్టితో ఏర్పాటుచేసిన బెర్మ్‌లు వర్షపు నీరు నిలిచిపోయి బురదగా మారుతోంది. ప్రజలు రోడ్డుదిగితే బురదలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. బురదలో బైకులు నడిపేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు అభివద్ధి చేసినా కష్టాలు తీరలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగించి కాలువలు నిర్మాణం చేపట్టాలని, అంతవరకు తాత్కాలికంగా వర్షం నీరు పోయేందుకు కచ్చా కాలువలు ఏర్పాటు చేయడంతో పాటు బెర్మ్‌లు బురదమయం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఒత్తిడి లేని జీవనానికి ధ్యానమే సాధనం


విద్యార్థులతో మాట్లాడుతున్న స్మరణానందగిరి

పాయకరావుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేని జీవనానికి ధ్యానమే అద్భుతమైన సాధనమని యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు స్వామి శ్రీస్మరణానందగిరి అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. లక్ష్య సాధన కోసం విద్యార్థులు ఏకాగ్రత పెంపొందించుకోవడానికి ధ్యానం ఒక మార్గమని సూచించారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్టుగా యోగా, ధ్యానం ద్వారా మనసులో ఉండే భయాలు తొలగిపోతాయన్నారు. అజ్ఞానం అనే అంధకారం తొలగించుకోవడానికి ధ్యానం సరైన మార్గమన్నారు. నిద్ర ద్వారా వచ్చే విశ్రాంతి, శక్తి కంటే ధ్యానం ద్వారా ఎక్కువ విశ్రాంతిని పొందుతామన్నారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి అనునిత్యం పుస్తక పఠనం చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి ధ్యానం, గురువుల ప్రాధాన్యత తదితర అంశాలను వివరిం చారు. అనంతరం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్ స్వామి స్మరణా నందగిరికి జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగద సత్సంగ ధ్యాన మండలి సభ్యులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి

▸▸ పశు సంవర్ధక శాఖ ఏడీ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న ఏడీ లక్ష్మీనారాయణ

కోటవురట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) లక్ష్మీనారాయణ సూచించారు. ఏలూరులో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన, శుక్రవారం కోటవురట్ల పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి ఏడీ పెట్ల నరేశ్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం పశు వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులకు వివరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ రాయితీలు రైతులు వినియోగించుకునేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన చెప్పారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి


కొత్తపోలవరంలో నిరసన తెలుపుతున్న కూలీలు

ఎస్.రాయవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనీయకుండా ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని గుడివాడ పంచాయతీ కొత్తపోలవరం గ్రామంలో శుక్రవారం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉపాధి కూలీలతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ, షిరిడీ ట్రస్టు కంపెనీల ద్వారా విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చి సామాన్య ప్రజలపై మరింత భారాన్ని మోపడానికి చూస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. దీన్ని ప్రతి ఒక్కరూ తిప్పి కొడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా తొలి శుక్రవారం పూజలు

నక్కపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా భక్తులతో కళకళలాడాయి. ఉపమాక, బంగారమ్మపేట, నక్కపల్లి, చినదొడ్డిగల్లు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఉపమాక దుర్గాభవానీ ఆలయంలో అర్చకులు వెలవలపల్లి మహేశ్ భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేశారు. ఉపమాక వెంకన్న ఆలయంలో కూడా శ్రావణ శుక్రవారం సందర్భంగా అర్చకులు పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో వున్న అమ్మవారి ఆలయాలు సందడిగా కనిపించాయి.

'చిక్కాల'కు ఘన సత్కారం


చిక్కాల రామారావును సత్కరిస్తున్న నాయకులు

పాయకరావుపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చిక్కాల రామారావును శుక్రవారం వైసీపీ నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిక్కాల మాట్లాడుతూ కార్యకర్తలుగా అండగా ఉంటానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, సర్పంచులు పన్నీరు పాపారావు, ఎం.రామగోవిందు, కోడ కోటేశ్వరరావు, నాయకులు డి.బాబూరావు, వి.రామారావు, జి.శ్రీనువాసరావు, డి.సాయిబాబా, చేపల తాతాజీ, పి.సతీశ్, ఎన్.బాలకృష్ణారెడ్డి, పల్లెల వెంకట్, యజ్జల అన్నవరం, ఎ.రాజు, బి.గోవిందు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కోటవురట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు పాములవాక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఎంఈవో-2గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణను శుక్రవారం వారు కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఎంఈవో-2 లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు పాటుపడాలని సూచించారు. ఎంఈవో-2ను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు సత్యాడదాసు, లోవరాజు, లచ్చబాబు, సంగీత్‌రాజ్, రాము ఉన్నారు.

పాయకరావుపేటలో ముసురు

పాయకరావుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో పాయకరావుపేటలో ముసురు పట్టింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అడపాదడపా వర్షం పడింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, కాలువల్లో మురికినీరు రోడ్లపై ప్రవహించింది. అలాగే పలు రహదారులు బురదగా మారడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని ధర్నా



కోర్టు ముందు ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలంటూ న్యాయవాదులు శుక్రవారం ఇక్కడి కోర్టు సముదాయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో స్థానిక న్యాయస్థానాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించాలని కోరారు. ముఖ్యంగా అనకాపల్లి కోర్టుకు పర్మినెంట్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిళ్లా హరశ్రీనివాస రావు, కార్యదర్శి బంధం వెంకటరమణ, సీనియర్ న్యాయవాదులు, ఐఏఎల్ సభ్యులు పీఏఎన్ నరసింహం, సాయి లక్ష్మణ, అడపా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాంకీ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం : ఎమ్మెల్యే



మొబైల్ వ్యాన్ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాంకీ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సేవలు అభినందనీయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా మండలంలోని పదకొండు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన వంట పాత్రలు, కుర్చీలు, బెంచీలు, ఫ్యాన్‌లను రాంకీ ఫౌండేషన్ సమకూర్చింది. ఆయా వస్తువులను ఎమ్మెల్యే చేతుల మీదుగా శుక్రవారం ఇక్కడ పంపిణీ చేశారు. అనంతరం మొబైల్ మెడికల్ వ్యాన్ సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు ఎంవీ రామిరెడ్డి, మర్రి దివాకర్, కె.శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండండి : జడ్సీ

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సూచించారు. ఇక్కడి లక్ష్మీదేవిపేటలో 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వారంలో ఒక రోజు ఇంట్లోని నీటి కుండీలను శుభ్రం చేసి ఎండలో ఉంచిన తర్వాతరోజు వాడుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు డస్టుబిన్‌లలో వేయాలన్నారు. అనంతరం అక్కడ తాగునీటిని జడ్సీ పరీక్ష చేయించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు పరిశీలించిన పీడీ

కశింకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో ఉన్న పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి శుక్రవారం సందర్శించారు. రైల్వే కాలనీ, 9వ వార్డు, నంబర్-2 స్కూళ్లలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న బోధనలపై ఆరా తీశారు. ప్రీ స్కూల్ చిన్నారులకు ఆట పాటలతో నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

లంకెలపాలెం కూడలిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

పరవాడ/లంకెలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలోని లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ లంకెలపాలెం కూడలిలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువైపోయాయన్నారు. పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూడలి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే, ప్రమాదాల్లో మృతి చెందినవారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మృతి చెందిన వారి ఫొటోలతో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రాజేష్, వరుణ్, సంతోష్ కుమార్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సత్కారం



మామిడిపాలెం పాఠశాలలో సత్కారం పొందిన ఉపాధ్యాయులు

తుమ్మపాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం హెచ్.బి.శ్రీధర్ మాట్లాడుతూ బదిలీపై వెళుతున్నవారు విద్యాభివృద్ధికి చేసిన కృషిని ప్రశంసించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అద్భుత ఫలితాల సాధనకు సమష్టిగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంది చినబ్బాయి, సుబ్బారావు, రమణి, వసంతరావు, కరుణ జ్యోతి, జి.లక్ష్మి, ఆడారి లక్ష్మి, సుజాత, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్గో లాజిస్టిక్స్ కౌంటర్‌ను తనిఖీ చేసిన డీపీటీవో



పార్శిల్ కాటాపై ఉంచి బరువును తనిఖీ చేస్తున్న డీపీటీవో ప్రవీణ

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న కార్గో లాజిస్టిక్స్ కౌంటర్‌ను డీపీటీవో వి.ప్రవీణ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్గో కస్టమర్‌కి అందించే సేవలు,కార్గో ఆదాయం పెంచడానికి అవసరమైన చర్యల గురించి సిబ్బంది, హమాలీలకు పలు సూచనలు చేశారు. డెలివరీ కౌంటర్ లోపల చాలా కాలంగా డిస్పాచ్ కాని పార్శిల్ విషయమై ఆమె ఆరా తీశారు. బుకింగ్‌కు వచ్చిన పార్శిళ్ల బరువును తనికీ చేశారు. ఆమె వెంట ఏడీఎం గౌరి, సిబ్బంది ఉన్నారు.

'పిలకమెట్టపై అక్రమ తవ్వకాలను అరికట్టాలి'

సబ్బవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ వెదుళ్లనరవలో గల పిలకమెట్టపై జరుగుతున్న అక్రమ తవ్వకాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు సదరు ప్రాంతాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. గత పది రోజులుగా రాత్రివేళ ఇక్కడ భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి గ్రావెల్, మెటల్‌ను అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలించుకుపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారని బీజేపీ నాయకుడు ఉరుకూటి దండుబాబు, 88వ వార్డు టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు చట్టి రాము, టీడీపీ సీనియర్ నాయకుడు రాజాన పైడిరాజు, జనసేన నాయకుడు దాకారపు శ్రీనివాసరావు ప్రశ్నించారు. కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరారు.

అమ్మవార్ల ఆలయాల్లో శ్రావణ పూజలు



నూకాంబిక ఆలయంలో సామూహిక కుంకుమార్చన, విశేష అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పూలదండలతో విశేషంగా అలంకరించారు. సంతోషిమాత ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, సర్వకామదాంబ అమ్మవారి ఆలయంతో పాటు మండలంలోని మరిన్ని ఆలయాల్లో అమ్మవార్లను అలంకరించి విశేష పూజలు జరిపారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సంతోషిమాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలావుంటే, గౌరీ పంచాయతన ఆలయంలో నెల రోజుల పాటు జరగనున్న హరికథా గానం శుక్రవారం రాత్రి ప్రారంభమైంది. తిరుపతికి చెందిన టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కళాకారిణి డాక్టర్ వి.విజయకుమారి హరికథ గానం చేపట్టారు. వెంకటాచల మహత్యం, శివపురాణం, స్కంధ పురాణం, శ్రీమద్భగవద్గీత అంశాలపై హరికథా గానం చేయనున్నారు. ఈ సందర్భంగా వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెను సత్కరించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో...

పరవాడ : ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్ కూడలిలో కొలువైన గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీ చక్రసహిత రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం విఘ్నేశ్వర పూజతో వేడుకకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు జరగనున్నాయి. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, కూటమి నాయకులు బుగిడి రామగోవింద రావు, వియ్యపు చిన్న, మోటూరి సన్యాసినాయుడు, దుల్ల రామునాయుడు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

దేవీపురం సహస్రాక్షి అమ్మవారి పీఠంలో...

సబ్బవరం : దేవీపురంలో గల రాజరాజేశ్వరీ సహస్రాక్షి అమ్మవారి పీఠంలో శ్రావణ మాసం వేడుకలు ప్రారంభమయ్యాయి. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో తొలి శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ విద్యాట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే, మండలంలోని అన్ని అమ్మవార్ల ఆలయాల్లోనూ ఈ పూజలు నిర్వహించారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



గోదాము తనిఖీలో కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్వో, ఆర్డీవో తదితరులు

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎం గోదాముల వద్ద భద్రతా సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఉన్న గోదాంను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. లాక్ బుక్ నిర్వహణ, ఇతర అంశాలపై రాజకీయ పార్టీ నాయకులతో చర్చించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయీషా, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి'



మాట్లాడుతున్న డీఆర్వో

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్ర జ్యోతి) : ఓటర్ల జాబితాలో సమస్యలు, అభ్యం తరాలు ఉంటే నేతలు తమ దృష్టికి తీసుకురావాలని డీఆర్వో వై.సత్యనారాయణరావు సూచించారు. వివిధ రాజకీయ పార్టీ నేతలతో ఓటర్ల జాబితా తయారీపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1150 ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాల్లో మరొక కొత్త పోలింగ్ కేంద్రాన్ని గుర్తించాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాలను తయారు చేయడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ప్రజా ప్రతినిధులను కోరారు. అనంతరం వివిధ రాజకీయపార్టీల నేతలు లేవనెత్తిన సం దేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్ఎస్వీ నాయుడు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ సీఎం రమేశ్ రాక

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ శనివారం ఇక్కడకు రానున్నారు. ఉదయం పది గంటలకు 84వ వార్డులోని సాలాపువానిపాలెంలో జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్‌తో కలిసి అభి వృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్న కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీకి హాజరవుతారు. మధ్యాహ్నం బీజేపీ నాయకులతో సమావేశం కానున్నారని ఆయన కార్యాలయ అధికారులు తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో వినతుల స్వీకరణ



వినతిని స్వీకరిస్తున్న కర్రి బాబి

తుమ్మపాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు రక్తదానం

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, వందేభారత్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఏర్పాటైన రక్తదాన శిబిరంలో యాభై మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.స్వాతిమనోజ్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానం ఎంతో గొప్పదన్నారు. రక్తదాన చైతన్యకర్త వినోద్‌బాలు మాట్లాడుతూ ఇప్పటి వరకు 1081 రక్తదాన శిబిరాలను నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన కార్పొరేటర్

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీనగరంలో గల ఉన్నత పాఠశాల, బీసీ, ఎస్సీ వసతి గృహాలను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత శుక్రవారం సందర్శించారు. స్టడీ హాల్స్ నిర్వహణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వండి వడ్డిస్తున్న ఆహార నాణ్యతపై ఉపాధ్యాయులతో చర్చించారు. వైసీపీ పట్టణశాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, కొండూరి రవీంద్ర, ఆకుల సంతోష్, ఏడువాకల నూకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కూటమి సమ ప్రాధాన్యం : బుద్ద



అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నో విజయాలు సాధించినట్టు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విశాఖపట్నానికి అనేక ఐటీ పరిశ్రమలు వచ్చేలా మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేశారన్నారు. మద్యం కుంభకోణంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయారని బుద్ద ఆరోపించారు.

జాబ్ క్యాలెండర్‌పై ప్రణాళిక ప్రారంభించాలని విప్ వినతి



చైర్‌పర్సన్‌కు వినతిని అందిస్తున్న వేపాడ

కొత్తూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జాబ్ క్యాలెండర్‌పై ప్రణాళిక ప్రారంభించాలని, గ్రూపు-2 అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసి ఫలితాలు ప్రకటించాలని కోరుతూ ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఎ.ఆర్.అనురాధ, కార్యదర్శి పి.రాజబాబులను కోరినట్టు ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారిని కలిసి వినతి పత్రం అందజేసినట్టు వివరించారు. ఎఫ్‌బీవో, ఏబీవో, ఎఫ్ఎస్‌వో రెండు పరీక్షలు ఒకే తేదీన ఉండడంపై ప్రస్తావించగా, దీనిపై ఎటువంటి ఇబ్బంది లేకుండా ఒకే పరీక్షా కేంద్రం గాని, సమీప కేంద్రం గాని కేటాయిస్తామని తెలినట్టు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రూపు-1లో ఎంపికైన వారి మార్కులను వెబ్‌సైట్‌లో అం దుబాటులో ఉంచుతామని చెప్పారని తెలిపారు.

ఆలయంలో అద్దాల మండపం ప్రారంభం

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం దిబ్బవీధిలోని వరహా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ దంపతులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మళ్ల రామచంద్రరావు, భక్తులు పాల్గొన్నారు.


,జి. మాడుగుల మండలంలో రాళ్లగెడ్డ వంతెనపైనుంచి గ్రామస్థుల రాకపోకలు


వర్షంలో వెన్నెల గ్రామంలో వరి నాట్లు వేస్తున్న గిరిజనులు

వీడని ముసురు

» పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
» వంతెనల వద్ద వరద ఉధృతి.. రాకపోకలకు అవస్థలు

జి.మాడుగుల, జూలై 25 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. రహదారులు బురదమయమై రాకపోకలకు ఆటంకంగా మారుతోంది.కుంబిడిసింగి పంచాయతీ అండంగిసింగి, రాళ్లగెడ్డలు మార్గంలో ప్రమాద స్థాయిలో వరద ఉధృతి కొనసాగుతోంది. కొత్తపల్లి జలపాతంలో వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. జాతీయ రహదారితో ప్రజల కష్టాలు వర్ణణాతీతం. ఈ నిర్మాణ పనుల్లో ముందు చూపు కొరవడి వాహన దారులకు వెతలు తప్పడం లేదు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి వంజరి సమీపంలో జాతీయ రహదారి కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మారుమూల ప్రాంతాల గిరిజనులు అత్యవసర, నిత్యావసరాలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. జోరువానలో గిరిజనులు వరినాట్లు వేస్తున్నారు.


కొత్తపల్లి జలపాతం వరవళ్లు

వాగులు, వంకలు, గెడ్డలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు పంచాయతీలకు చెందిన వారు మండల కేంద్రానికు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష ఈ సందర్భంగా తెలిపారు.

కూలిన చెట్టు.. రాకపోకలకు అంతరాయం

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండ, సీలేరుల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లే కుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో శుక్రవారం ఉదయం ధారకొండ గుమ్మిరేవుల ప్రధాన రహదారిలో సాధుపాకల వద్ద చెట్టు విద్యుత్ తీగలపై పడింది. వెంటనే స్థానికులు ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు కూలిపోవడంతో ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు చెట్టును తొలగించడంతో రాకపోకలు యధావిధిగా సాగాయి. అనంతరం టాన్స్‌కో సిబ్బంది వచ్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కొయ్యూరు: మండలంలో గురువారం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు వర్షం కొనసాగింది. ప్రస్తుత ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఈ వర్షం ఆటంకంగా మారింది. రైతులు వర్షంలోనే దమ్ములు, నాట్లు వేస్తున్నారు. ఈ వర్షాలకు కొండవాగు ప్రవాహాలు, చెక్‌డ్యామ్‌లనుంచి పుష్కలంగా నీరు వస్తోంది. రిజర్వాయర్లు, చెరువులు వరదనీటితో నిండుగా కనిపిస్తున్నాయి.

ముంచంగిపుట్టులో ఈదురుగాలులతో వర్షం

ముంచంగిపుట్టు: మండల పరిధిలో రెండు రోజులుగా వర్షం వీడటం లేదు. శుక్రవారం ఈదురు గాలులతో పాటు వర్షం కురిసింది. నిత్యం రద్దీగా ఉంటే స్థానిక నాలుగు రోడ్ల కూడలిపై జనసంచారం తగ్గింది.


ధారకొండ- గుమ్మిరేవుల రహదారిలో కూలిన చెట్టు

ఆధార్ సేవలకు మొబైల్ కిట్లు: కలెక్టర్

పాడేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆధార్ కార్డుల నమోదుకు 222 మొబైల్ కిట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. మొబైల్ ఆధార్ కిట్లను శుక్రవారం సంబంధిత సిబ్బందికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికీ ఆధార్ కార్డులులేని వారిని గుర్తించి వారికి కొత్తగా నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ఈ మొబైల్ కిట్లను వినియోగిస్తామన్నారు. గ్రామ సచివాలయ వారీగా ఈసేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మొత్తం 222 మొబైల్ కిట్లలో 72 సిరీ సాఫ్ట్‌వేర్ సెల్యూషన్స్, 150 పాడ్యమి ఐటీ సెల్యూషన్స్ ఆధ్వర్యంలో సేవలందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్, పీఎంయూ అధికారి ఆర్. గోపాల్, ఆధార్ కో ఆర్డినేటర్ డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆధార్ మొబైల్ కిట్ ల్యాప్‌లాప్ అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జేసీ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

శ్రావణ మాస పూజలు ప్రారంభం

పాడేరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శుక్రవారం పట్టణంలోని పలు దేవాలయాల్లో సందడి నెలకొంది. ఉదయం 6 గంటల నుంచి మహిళలు ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంతోపాటు, అయ్యప్పస్వామి, మోదకొండమ్మ, షిర్డీ సాయిబాబా, కనకదుర్గమ్మ ఆలయాలను సందర్శించి సందర్శించి పూజలు చేశారు. ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి ఆలయంలోని రాజరాజేశ్వరి, మహాలక్ష్మి అమ్మవార్లకు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులు కుంకుమాభిషేకాలను చేపట్టారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, యూవీ రత్నకుమార్, వైదేహి, కె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పూర్ణపుష్కల


ఉమానీలుంఠేశ్వర ఆలయంలో శ్రావణమాస పూజల్లో పాల్గొన్న భక్తులు

అయ్యప్పస్వామి ఆలయంలోని మహాలక్ష్మికి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధుతు ఆదిత్య, సత్యనారాయణరాజు, దామోదరం, రొబ్బి రాము, సత్తిబాబు తదితరులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అందుబాటులోకి వసతి గృహం

» 9, 10, ఇంటర్ గిరిజన, గిరిజనేతర బాలికలు అర్హులు

అరకులోయ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఈ విద్యాసంవత్సరం నుంచి అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి గృహం అందుబాటులో వచ్చింది. ఇందు లో 100 సీట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ వసతిగృహంలో తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం చదువుకునే గిరిజన, గిరిజనేతర బాలికలు ఉండేందుకు అర్హులు. ఒక్కో తరగతికి 25 సీట్లు చొప్పున కేటాయించారు. ఇప్పటి వరకు 9, 10 వతరగతులకు 38 మంది నుంచి దరఖాస్తులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్టు హెచ్‌ఎం మోహనరావు తెలిపారు. బాలికలు తొమ్మిది, పది తరగతులకు సంబంధించి మరో 12 సీట్లుండగా, ఇంటర్‌లో చదువుకునే బాలికలకు 48 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో వసతి గృహం భవనంను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే నూతనంగా నిర్మించారు. వేర్వేరు గ్రామాల నుంచి అరకులోయకు వచ్చి చదువుకునే బాలికలకు ఈ వసతిగృహం ఎంతగానో ఉపయోగపడుతుంది. డేస్ కాలర్స్‌గా వచ్చే 9, 10 తరగతులతోపాటు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర బాలికలుదరకాస్తు చేసుకుని వసతిగృహంలో సీటు పొంది చదువుకోవచ్చునన్నారు.


అరకులోయలో బాలికల వసతిగృహం ఇదే..

చందాలతో రహదారి నిర్మాణం


ఎక్స్‌కవేటర్‌తో రహదారి పనులు చేపడుతున్న కోతిగొంది గిరిజనులు

గూడెంకొత్తవీధి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెంకొత్తవీధి శివారు కోతిగొంది గ్రామానికి చెందిన ఆదిమ ఆదివాసీలు చందాలతో రహదారిని నిర్మించుకుంటున్నారు ప్రభుత్వం గ్రామంలోని గిరిజనులకు పీఎం జన్ మన్ పక్కా గృహాలు మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి ఇసుక, సిమెంట్, కంకర, ఐరన్ తీసుకు వెళ్లేందుకు కనీస మార్గంలేదు. గత వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారులకు గ్రామానికి రహదారి నిర్మించాలని పలు మార్లు దరఖాస్తు చేసుకున్నా ఏ ఒకరూ పట్టించుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన ఆదివాసీలు ఒక్కో కుటుంబం రూ.వెయ్యి చొప్పున చందాలు వేసుకున్నారు. శుక్రవారం ఎక్స్‌కవేటర్‌ని అద్దెకు తీసుకువచ్చి రెండు కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించుకుంటున్నారు. ప్రభుత్వం గ్రామానికి కనీసం మె టల్ రోడ్డునైనా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు


మూలగరువు- కొత్తూరు రహదారి పరిశీలిస్తున్న ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి: మండలంలో అధ్వానంగా తయారైన మూలగరువు కొత్తూరు-లోతుగెడ్డ రహదారి నిర్మించాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి కోరారు. గురువారం జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మితో కలిసి బలపం పంచాయతీలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాళ్లగెడ్డ, మూలగరువు రహదారి వర్షానికి పూర్తిగాపాడైపోవడంతో వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండాపోయిందన్నారు. బలపం, కుడుముసారి పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల ప్రజలతోపాటూ ఒడిశా ప్రజలు ఈ మార్గంలో కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారన్నారు. సర్పంచ్ రమేశ్, ఏపీవో రాజు పాల్గొన్నారు.

'డుడుమకు బస్సు సర్వీసును నడపాలి'


ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న గిరిజన నేతలు

ముంచంగిపుట్టు, జులై 25 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ డిపో నుంచి మండల కేంద్రం మీదుగా డుడుమ వెళ్లే బస్సు సర్వీసును సక్రమంగా నడపాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఈ మేరకు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా డుడుమ బస్సు సర్వీసు అటుగా సక్రమంగా నడపక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆ రూటులో తిరిగే ఒకేఒక్క ఆర్టీసీ బస్సును రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని చెప్పారు. డుడుమ బస్సు కోసం పోలిపుట్టు, లబ్బూరు, మాకవరం, తలబిరడ, అసరాడ, దాబుగూడ, సంగడ తదితర బస్‌స్టాప్‌ల వద్ద ప్రతీ రోజు జనాలు బస్సు కోసం నిరీక్షిస్తున్నారని చెప్పారు.

బర్త్ వెయిటింగ్ హాల్‌లో ప్రసవాలు శ్రేయస్కరం


వసతి గృహంలో గర్భిణులతో మాట్లాడుతున్న స్త్రీ వైద్యనిపుణులు వాసవి

చింతపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగానే వసతి గృహం (బర్త్ వెయిటింగ్ హాల్)లో చేరాలని స్థానిక ఏరియా ఆస్పత్రి స్త్రీ వైద్యనిపుణులు ఎస్. వాసవి సూచించారు. శుక్రవారం ఏరియా ఆస్పత్రిని అనుబంధంగా ఐటీడీఏ నిర్వాహణలోనున్న గర్భిణుల వసతి గృహానికి ఆమె సందర్శించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో భోజన వసతి, వైద్యుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. శివారు గ్రామాల్లో గర్భిణులకు పురిటి నొప్పులు ప్రారంభమైన సమయంలో డోలిలో మోసుకొస్తున్నారన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తొమ్మిది నెలల్లో కనీసం ఒకసారైన ఆస్పత్రికి వచ్చి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు ముందుగానే వసతి గృహంలో చేరాలన్నారు. ఈకార్యక్రమంలో ఎల్‌టీ అనిల్ పాల్గొన్నారు.

నేడు పరిశ్రమల అభ్యర్థులతో ముఖాముఖి

పాడేరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖ ద్వారా సబ్సిడీల కోసం దరఖాస్తుకుని, ఇంత వరకు సదస్సులకు హాజరుకాని వివిధ పరిశ్రమల, సేవా సంస్థల ప్రతినిధులతో ఈ నెల 26వ తేదీన ఐటీడీఏ కార్యాలయంలోజిల్లా పరిశ్రమల కేంద్రంలో ముఖాముఖీ సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా పరిశ్రమల అధికారి జి.రవిశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు ఒరిజనల్ పత్రాలతో మాజరు కావాలన్నారు. సమాచారం కోసం ఫోన్: 8500 541363 సంప్రదించాలన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యా సంస్థల్లో 2026-27లో 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు ఈ నెల 29వ తేదీలోగా విద్యార్థులు ఈ నెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా విశాఖ జిల్లా కొమ్మాది లేదా అల్లూరి జిల్లా ఎటపాకలో ఉన్న నవోదయ విద్యా సంస్థల్లో చేరేందుకు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు.ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ ఉంటుందన్నారు. 1/3వ వంతు సీట్లు బాలికలకు కేటాయిస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

టీబీ రహిత దేశం సాధనే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, తదితరులు

పాడేరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత దేశం సాధించే లక్ష్యంతో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ అవగాహన పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ముందస్తుగా రోగ నిర్ధారణ, ఇందులో సమాజ భాగస్వామ్యంపై వైద్య ఆరోగ్య శాఖాధికారులు దృష్టి సారిస్తున్నారన్నారు. ఈ మేరకు మార్గదర్శకాలు, కార్యక్రమాలను వివరించారు. టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో డాక్టర్.ఎంజే అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా సహాయ కలెక్టర్ వెంకట సాహిత్, జిల్లా కుష్టువ్యాధి, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్.ఎం.కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో పర్యవేక్షకులు కిరణ్, టీబీ ప్రోగ్రాం సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని వినూత్న నిరసన

అనంతగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లగరువు నుంచి తుస్సీబ్ వయా దాయర్తి మీదుగా మడ్రేబ్ రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం ఆయా గ్రామాల గిరిజనులు గుర్రాలతో వినూత్నంగా మూడు కిలో మీటర్లమేర పాదయాత్ర చేసి నిరసన తెలిపారు. జీనబాడు, పినకోట, పెదకోట పంచాయతీల పరిధిలోని ఈ రహదారికి గత జనవరిలో రూ. 11.63 కోట్ల నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీం తో డోలీమోతలపై రోగులు, గర్భిణులను తరలించాల్సిన దుస్థితి నెలకొంటోంది. దాయర్తి గ్రామం గిరిజనులు రేషన్ సరకులు కోసం జీనబాడుకు వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు సీపీఎం జిల్లా నాయకులు గోవిందరావు, గిరిజనులు కోరుతున్నారు.


గుర్రాలపై వస్తూ నిరసన చేపడుతున్న గిరిజనులు

గోమంగిని మండల కేంద్రం చేయాలని వినతి

పాడేరురూరల్/ పెదబయలు జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలంలోని గోమంగి పంచాయతీ కేంద్రాన్ని మండల కేంద్రంగా మార్పు చేయాలని కోరుతూ గోమంగి మండల సాధన కమిటీ నాయకులు శుక్రవారం కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌కు వినతిప త్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం 1983లో మండలాలను ఏర్పాటు చేసిన సమయంలో గోమంగి గ్రామంలో సౌకర్యాల లేమిని గుర్తించి పంచాయతీకేంద్రానికి పరిమితం చేశారన్నారు. తమ పోరాట ఫలితంగాఈ పంచాయతీలో సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. గోమంగి నుంచి మండల కేంద్రం పెదబయలు 35 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అక్కడికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. గోమంగి పంచాయతీ పరిసర 17 పంచాయతీలకు కేంద్ర బిందువుగా ఉన్నదన్నారు. ఈ స్థితిలో గోమంగిని మండల కేంద్రంగా చేయాలని కోరారు. నాయకులు సల్లంగి ఉమామహేశ్వరరావు, కూడా రాధాకృష్ణ, కొమ్మ బాలరాజు, కె.పద్మనాభం, కొం డలరావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గోమంగి మండల సాధన కమిటీ నాయకులు

'స్పెషల్ డీఎస్సీపై ప్రకటన చేయాలి'

పాడేరురూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రకటన చేయాలని ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు సాగిన ధర్మానపడాల్, ఎస్.సత్యనారాయణ, కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాం తంలో 100 శాతం ఉద్యోగ నియామక చట్టం చేయాలన్నారు. అంత వరకు మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ప్రాంత పోస్టుల భర్తీని మినహాయించాలని డిమాండ్ చేశారు. తమ పోరాటాల నేపథ్యంలో స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మే 13న 100 శాతం ఉద్యోగ నియామకాలు చేస్తామని ప్రకటించినా, అయితే, మెగా డీఎస్సీ నుంచి ఆది వాసీ ప్రాంత పోస్టుల భర్తీ మినహాయిస్తున్న అంశంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేదీన పాడేరులో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బి.రామకృష్ణపడాల్, డీపీ శంకర్, ఎం.విష్ణుమూర్తి, వినయ్, రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు సన్మానం

గూడెంకొత్తవీధి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలస గ్రామ సచివాలయం నుంచి బదిలీపై వెళుతున్న ఉద్యోగులను ప్రజాప్రతినిధులు, కూ టమి నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం బదిలీఅయిన డిజిటల్ అసిస్టెంట్ కుందారి వసంత కుమారి, గ్రామ సర్వేర్ వంతల నాగేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ శివ ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రవీంద్రబాబుని సత్కరించి వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత, వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆ నంద్, సర్పంచ్ వంశీకృష్ణ, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.


పెదవలసలో ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు: వనుగుమ్మ గ్రామ సచివాలయంనుంచి బదిలీపై వెళ్లిన ఐదుగురు ఉద్యోగులను శుక్రవారం ఘ నంగా సన్మానించారు. వనుగుమ్మ, రంగబయలు పంచాయతీలకు చెందిన ప్రజలు, వైస్ ఎంపీపీ ఎస్. భాగ్యవతి, సర్పంచులు మిల్కి, ధనియాలు ఉద్యోగులకు సన్మానం చేసి, జ్ఞాపికలను అందించారు. ఉప సర్పంచ్ సీతారామ్, కార్యదర్శులు కిరణ్, భగత్, వైసీపీ నేతలు దేవా, నీలకంఠం పాల్గొన్నారు.


వనుగుమ్మలో ఉద్యోగులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ. సర్పంచ్‌లు

బదిలీ అయిన 23 సచివాలయాల సిబ్బంది రిలీవ్

కొయ్యూరు: మండలంలో 23 గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న వివిధ కేడర్లకు చెందిన 113 సిబ్బందికి ఇటీవల బదిలీ అయ్యాయి. వీరిలో 96 మంది ఉద్యోగులను రిలీవ్ చేసి నూతనంగా వచ్చిన వారిని విధుల్లో జాయిన్ చేసుకున్నట్టు ఎంపీడీవో వీడీకే ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు 23 సచివాలయాలకు చెందిన డీఏలు 18 మందిని రిలీవ్ చేసి వారి స్థానాలలో 17 మందిని జాయిన్ చేసుకున్నామన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు

కొయ్యూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి) వర్షాకాలంలో విద్యార్థులు ఆ రోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ సూచించారు. శుక్రవారం రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎవరికీ జ్వరాలు లేవన్నారు. దగ్గ, జలుబు తదితర సమస్యలతో బా ధపడుతున్న 15 మంది విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కాచి వడపోసిన నీటిని సరఫరా చేయాలని, సీజనల్ వ్యాధుల రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రశాంత్, హెచ్‌వీ లక్ష్మి,హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎం, హెచ్‌ఎం మృదుభాషిణి సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక కేజీబీవీలో పీహెచ్‌సీ వైద్యాధికారి నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురి జ్వరపీడితులను రక్త పరీక్షలు చేశారు. వీరిలో ఎవరికీ మలేరియా లేదని గుర్తించారు. అలాగే, బొయితిలిలో ఆంధ్ర వనవాసీ కల్యాణ్ ఆశ్రమ్ ద్వారా 161 మంది రోగులకు వ్యాధి నిర్ధారణ చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ వైద్యాధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. వండిన ఆహార పదార్థాలను చేతితో కాకుండా గరిటేలతో వేయాలని వైద్యాధికారి సూచించారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో దోమతెరలు వాడాలని, పలు ఆరోగ్య సూచనలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బొయితిలి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థికి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి హేమంత్

మధురుమామిడిలో క్యాథలిక్ పాఠశాల, ఆస్పత్రి ప్రారంభం

జి.మాడుగుల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సొలభం పంచాయతీ మధురుమామిడిలో క్యాథలిక్ పాఠశాల, కమ్యూనిటీ భవనంతోపాటు ఆసుపత్రిని శ్రేయస్ డియోసిస్ బేతరీ వైనాడు కేరళ వారి సహయంతో శుక్రవారం ప్రారంభించారు. ఈ మేరకు శ్రేయస్ డియోసిస్ బేతరీ బిషప్ మదర్, స్థానిక సర్పంచ్ హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాదర్స్ స్టీఫెన్ మోబిన్, సిస్టర్స్ జూడిట్, జూలియన్ సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం లాభదాయకం: ఏవో

చింతపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి):పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని స్థానిక ఏవో మధుసూదనరావు అన్నారు. శుక్రవారం వ్యవసాయ, ఉద్యాన సహాయకుల శిక్షణలో భాగంగా గాడిదలమెట్టలో గిరిజన రైతులు సాగు చేస్తున్న సేంద్రియ పంటల్లో క్షేత్ర ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ఎన్ఎఫ్ఏ కుమార్, ఎన్ఎఫ్ఏ టీఎన్‌సీ బాబాజీ, మెంటర్ రాజుబాబు, చింతపల్లి యూనిట్ ఇన్‌చార్జి కొర్ర మోహన్‌రావు, వీహెచ్ఏ, వీఏఏ, ఎంపీఈవోలు పాల్గొన్నారు.


ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



నర్సీపట్నం దుర్గమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నర్సీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి గుడికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భారీ ఎత్తున భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తు రద్దీ తగ్గలేదు. కమిటీ సభ్యులు అమ్మవారి అన్నప్రసాదం పంపిణీ చేశారు.

వడ్డాది వెంకన్న ఆలయంలో...

బుచ్చెయ్యపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది గిరిజాంబ గిరిపైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాస పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అర్చకులు అంగర శ్రీకాంతాచార్యులు అధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యావచనం, రక్షసూత్ర, ఆరాధన, విశేష పంచామృత అభిషేకం, కుంకమార్చన పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు అమ్మవారికి శ్రావణమాస పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

పొలాల్లో మట్టి తొలగించరూ..



సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నర్సీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలోని జి.కోడూరు గ్రామంలో సర్వే నంబరు 332లో క్వారీకి ఎదురుగా ఉన్న భూముల్లో మట్టి తొలగించాలని దళిత రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. రాధాకృష్ణ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం రాజాసాగి ఎస్‌వీఎస్ఎన్ రాజు నుంచి నల్ల రాయి క్వారీని లీజుకు తీసుకొని 2020 మే 9 నుంచి 2025 జనవరి 1 వరకు నడిపారని, క్వారీ సమీపంలో ఉన్న భూములకు నష్ట పరిహారం ఇచ్చేవారని తెలిపారు. తాజాగా క్వారీ రాజాసాగి రాజు నుంచి బంగార్రాజుకు లీజు బదలాయింపు జరిగిందని, వారు కూడా పంట నష్ట పరిహారం ఇస్తామని చెప్పారని, భూముల్లో మట్టి తొలగించాలని పాత లీజుదారుని కోరితే తీయడం లేదని చెప్పారు. దీనిపైఅధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



కొత్తకోట విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేఖ

రావికమతం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సురేఖ సూచించారు. కొత్తకోట ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న వరికి చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షా కాలం ముగిసే వరకు విద్యార్థులు నీటినే తాగాలని సూచించారు. అలాగే వసతి గృహంలో తయారు చేసిన వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలని తెలిపారు. బయట దుకాణాల్లో అమ్ముతున్న పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మ, హెచ్‌వీ ఎర్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌పై ప్రణాళిక ప్రారంభించాలని విప్ వినతి



చైర్‌పర్సన్‌కు వినతిని అందిస్తున్న వేపాడ

కొత్తూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్‌పై ప్రణాళిక ప్రారంభించాలని, గ్రూపు-2 అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసి ఫలితాలు ప్రకటించాలని కోరుతూ ఏపీపీఎస్‌సీ చైర్‌పర్సన్ ఎ.ఆర్.అనురాధ, కార్యదర్శి పి.రాజబాబులను కోరినట్టు ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారిని కలిసి వినతి పత్రం అందజేసినట్టు వివరించారు. ఎఫ్‌బీవో, ఏబీవో, ఎఫ్ఎస్‌వో రెండు పరీక్షలు ఒకే తేదీన ఉండడంపై ప్రస్తావించగా, దీనిపై ఎటువంటి ఇబ్బంది లేకుండా ఒకే పరీక్షా కేంద్రం గాని, సమీప కేంద్రం గాని కేటాయిస్తామని తెలినట్టు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రూపు-1లో ఎంపికైన వారి మార్కులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారని తెలిపారు.

గ్రామాల్లో చురుగ్గా వరి నాట్లు



శిరిజాం పొలాల్లో వరి ఆకు తీస్తున్న రైతులు... (ఇన్‌సెట్) చినకోనాంలో ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతు

చీడికాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో రైతులు వరి నాట్లు ప్రారంభించారు. ఆదివారం నుంచి ప్రతీ రోజు కురుస్తున్న అడపాదడపా వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు దీనికితోడు వ్యవసాయ బోర్లు ఉండడంతో సాగునీటిని వరి పొలాలకు మళ్లిస్తున్నారు. ముందుగా వరి ఆకులు వేసుకున్న రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. మండలంలోని చినకోనాం, శిరిజాం, ఖండివరం, చీడికాడ, అప్పలరాజుపురం, ఎల్‌బి.పట్నం గ్రామాల్లో చురుగ్గా వరి నాట్లు వేస్తున్నారు. ముందుగా వరిసాగు చేయడం వల్ల కూలీల కొరత లేదని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాతకృష్ణాదేవిపేటలో తాగునీటి కష్టాలు

పైపులైన్ ధ్వంసం.. మరమ్మతుకు నోచుకోని వైనం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అర్‌డబ్ల్యూఎస్ అధికారులు

రెండు నెలలుగా తాగునీటికి గ్రామస్థులు అగచాట్లు



పాతకృష్ణాదేవిపేటలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న తాగునీటి ట్యాంకు

కృష్ణాదేవిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పాతకృష్ణాదేవిపేట గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. పైపులైన్ ధ్వంసం కావడంతో ఈ దుస్థితి దాపురించింది. రెండు నెలలుగా పైపులైన్‌ను మరమ్మతు చేయకపోవడంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సిహెచ్.నాగాపురం గ్రామ శివారులోని పల్లావూరు గ్రామంలో రెండు నెలల క్రితం కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. అప్పటిలో పాతకృష్ణాదేవిపేటను అనుకుని ఉన్న పల్లావూరులో కల్వర్టుతో పాటు డ్రైనేజీ పూడికతీత పనులు చేశారు. ఇందులో భాగంగా లింగంపేట భారీ మంచినీటి ప్రాజెక్టు నుంచి పాతకృష్ణాదేవిపేటలో గల పది వేల లీటర్ల భారీ వ్యాటర్ ట్యాంకుకు వెళ్లే పైపులైన్ ధ్వంసమైంది. అప్పటి నుంచి ప్రజలు అధికారులకు, పాలకులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. దీంతో సిహెచ్.నాగాపురం సర్పంచ్ రఘురామ్‌కు, గొలుగొండ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమస్యను తెలిపామని, వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, టీడీపీ నాయకులు మువ్వల వరహాల బాబు, బొప్పాది రమణ ఆరోపించారు. దీంతో సుమారు వంద కుటుంబాల వారు రెండు నెలలుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమీప వ్యవసాయ బోర్లు, మరో గ్రామానికి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతుల కోసం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేనిపక్షంలో మహిళలతో ఆందోళన దిగుతామని హెచ్చరించారు.



ధ్వంసంమైన పైపులైన్ చూపుతున్న టీడీపీ నాయకులు రమణ, వరహాలబాబు

దళితుల దీక్షలపై ఆర్డీవో స్పందించాలి

నర్సీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలోని జి.కోడూరు దళితులు మూడు రోజులుగా చేస్తున్న నిరసన దీక్షలపై ఆర్డీవో స్పందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. కోడూరు గ్రామంలోని క్వారీ తవ్వకాల వల్ల జీడిమామిడి పంటలకు నష్టం జరుగుతుందని దళితులు చేస్తున్న రిలే దీక్షలను శుక్రవారం సీపీఎం నాయకులు సందర్శించి, దళితులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ వ్యర్థాల వల్ల పంట పాడవుతుందన్నారు. ఆర్డీవో తక్షణమే స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టా నాగరాజు మాట్లాడుతూ మూడు రోజుల నుంచి ఆర్డీవో కార్యాలయం వద్ద దళితులు దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. అధికారులు స్పందించకపోతే దళితులతో క్వారీ లీజు రద్దు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం అబీద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు.

కొత్తకోటలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

రావికమతం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తకోటలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.27 లక్షలు మంజూరయ్యాయని సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భగవంతురావు, సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ ఈవో జ్యోతిరెడ్డి గ్రామంలో పర్యటించి ప్రాథమికంగా నీటి సౌకర్యాలు ఉన్న నాలుగు ప్రాంతాలను పరిశీలించారు. నీటి సౌకర్యం ఉన్న తొమ్మిది చోట్ల నాలుగు చొప్పున 36 మరుగుదొడ్లు నిర్మించాలని కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని మండల గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ భగవంతరావు తెలిపారు. స్థల సమీకరణ పూర్తయిన తర్వాత నిర్మాణ పనులు చేపడతామని ఆయన తెలిపారు.

గిరిజన విద్యార్థులకు కాస్మోటిక్స్ పంపిణీ

దేవరాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాల్లో విద్యార్థులకు సత్యసాయి భక్తులు శుక్రవారం కాస్మోటిక్స్ అందించారు. మండలంలోని రేగుల బంద, బుచ్చింపాలెం, పాత వాలాబు, కొత్త వాలాబు గ్రామాల్లో సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో పెన్నులు, గొడుగులు, ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా కాస్మోటిక్స్ అందించారు. పెద్దవారికి పంచెలు, చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదిరెడ్డి చినకన్నబాబు, వరదపురెడ్డి లలితా ప్రసాద్, కె.రాంబాబు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

చీడికాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని ఎంపీటీసీ సభ్యుడు బీశ్ల కోటేశ్వరరావు చెప్పారు. తురువోలు గ్రామంలో బుద్దిబండ చెరువు గట్టుపై వంద కొబ్బరి మొక్కలను శుక్రవారం నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండల అప్పారావు, ఉప సర్పంచ్ టీడీపీ పాల సంఘం అధ్యక్షుడు ముర్రు అప్పడమ్మ, జిల్లా నాయకుడు రెడ్డి సన్యాసినాయుడు, వీఆర్పీ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ముందుకురండి

చీడికాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిసరాల పరిశుభ్రతకు అందరూ ముందుకు రావాలని డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖర్ కోరారు. మండలంలోని ఖండివరం గ్రామంలో ఇంటింటికీ శుక్రవారం వెళ్లి నీటి తొట్టెలు, డ్రైనేజీలను పరిశీలించి నీటి నిల్వలు లేకుండా చూడాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీలా పద్మావతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్ఐకు సత్కారం



ఎస్ఐను సత్కరిస్తున్న దృశ్యం

దేవరాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వి.సత్యనారాయణను ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జడ్పీటీసీ కర్రి సత్యం ఆదివారం శాలువాతో సత్కరించారు. వైసీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, వైస్ ఎంపీపీ సింహాచలంనాయుడు, నాయకులు గంగాభవాని, చింతల వెంకటరమణ, సుదారాణి తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో తేలకపాటి జల్లులు

మాడుగుల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి తేలిపాటి జల్లులు పడుతున్నాయి. దీంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. అలాగే వ్యవసాయ రైతులు దుక్కులు దున్ని, నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మరి కొంతమంది వేసిన నారును తీసి దమ్ము పట్టిన పొలాలకు తరలించే పనిలో పడ్డారు.

డిజిటల్ అసిస్టెంట్ నియమించాలి

గొలుగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ రెండేళ్లుగా లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ చినప్పారావు, కూటమి నాయకులు రాము, రమేష్ శుక్రవారం ఈవోపీఆర్‌డీకు వినతిపత్రం అందించారు. రెండేళ్లుగా డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో పలు అభివృద్ధి పథకాలు ఆన్‌లైన్‌తో పాటు ప్రజల ఇతర అవసరాకుల అనేక ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. దీంతో త్వరితిగతిన డిజిటల్ అసిస్టెంట్ ఏర్పాటు చేయాలని కోరారు.

గ్రామాల్లో నిరుపేదలకు గుర్తించండి



ఎర్రవరంలో పి-4 గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరుపేదలను గుర్తించాలని ఎంపీడీవో మేరీ రోజీ సూచించారు. మండలంలోని గొలుగొండ, ఎర్రవరం గ్రామాల్లో శుక్రవారం నిరుపేదల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమంలో నిరుపేదలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ పథకం పేదరిక నిర్మూలనకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసిపల్లి చినప్పారావు, కార్యదర్శులు రమణ, జగదీశ్వరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో పారిశుధ్య పనులు



కొంగసింగి రహదారిలో ట్రాక్టర్‌లోకి చెత్తను ఎత్తుతున్న ఎక్స్‌కవేటర్

కృష్ణాదేవిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మర చేపట్టారు. ఏఎల్ పురం శివారులోని కొంగసింగి రహదారిలో నెలలు తరబడి పేరుకుపోయిన చెత్త కుప్పలను, ఎంపీపీ పాఠశాల వద్ద డ్రైనేజీలో పేరుకుపోయిన మురగును ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఈ పనులు చేయించారు. దీంతో ప్రయాణికులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల శ్రమదానంతో పంట కాలువలకు మోక్షం



కొల్లివారి కల్లాల వద్ద పంట కాలువలో పూడికలు తొలగిస్తున్న రైతులు

దేవరాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొల్లి వారి కళ్లాలు నుంచి తెనుగుపూడి గురుకల కళాశాల వరకు పంట కాలువల్లో పూడికలను రైతులు శ్రమదానంతో తొలగించారు. గ్రామంలోని రైతులంతా కలిసి శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఖరీఫ్‌నకు నీరు విడుదల చేయనుండడంతో వరి నాట్లు వేయడానికి కాలువలు పూర్తిగా పూడికపోవడంతో నీరు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, అందుకే ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకుండా తామంతా కలిసి శ్రమదానంతో పూడికలు తొలగించుకున్నామని రైతులు తెలిపారు.

మాడుగుల మీదుగా బస్సులు నడపండి

▸▸ అనకాపల్లి ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌కు వినతి



ఆర్టీసీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మాడుగుల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు సర్వీసులను మాడుగుల మీదుగా నడపాలని కోరుతూ అనకాపల్లి ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. టీడీపీ మాడుగుల అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాయకులు ఈ కార్యక్రమం చేపట్టారు. మాడుగుల ఆర్టీసీ కాంప్లెక్స్ ఏళ్ల కాలంగా నిరుపయోగంగా ఉండిపోయిందని, దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. దీంతో శుక్రవారం సిబ్బందితో మాడుగుల వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్, అటుగా వెళ్లేందుకు రోడ్డు పరిస్థితి సూపరింటెండెంట్ పరిశీలించారు. పాడేరు వెళ్లే ప్రతీ ఆర్టీసీ బస్సు మాడుగుల మీదుగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ విషయన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదం

నర్సీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని డీఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించినా, అక్రమ రవాణాకు పాల్పడినా జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు'

రోలుగుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేసి సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎస్.కొత్తూరు గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. గతంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడమే తమ కర్తవ్యమన్నారు. గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి నారాయణరావు, లోకవరపు సత్యనారాయణ, కర్రి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల కోసం ఉపాధి కూలీల ర్యాలీ

బుచ్చెయ్యపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో బంగారుమెట్ట గ్రామంలో ఉపాధి పథకం కూలీలు వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఐటీయూ నాయకులు ఎస్‌వీ.నాయుడు, సినపాత్రుని సాంబశివరావు మాట్లాడుతూ ఏడు వారాలుగా ఉపాధి కూలీల వేతనాలను అందించకపోవడం విచారకరమని వాపోయారు. వేతన బకాయి బిల్లుల మంజూరుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు ఘన నివాళి

కె.కోటపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం జీవిత కాలం పోరాడిన యోధుడు వీఎస్ అచ్యుతానందన్ అని సీఐటీయూ నాయకులు కొనియాడారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో కేరళ మాజీ సీఎం కామ్రేడ్ అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎనిమిది దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో మచ్చలేని నాయకుడిగా నిలిచారని సీఐటీయూ మండల కార్యదర్శి ఎర్ర దేముడు, ఈర్లె నాయుడుబాబు అన్నారు. వీఎస్ చేసిన సేవలు కొనియాడుతూ ఆయన పోరాట పటిమను ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు టీసీఎస్ అధ్యక్షులు కండిపల్లి సహదేవుడు, ఎ.కోడూరు, టిసిఎస్ అధ్యక్షులు శెట్టి రమణ, కడవల వెంకటేశ్, బండారు మరిడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రహదారిలో చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోండి

మాకవరపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమబోయినపాలెం నుంచి శెట్టిపాలెం వరకు రోడ్డుకిరుపక్కలా ఉన్న చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు చిటికల వెంకటమరణ పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం రోడ్డు వెడల్పు చేస్తామని రోడ్డుకిరువైపులా వేసిన మొక్కలను నరికివేసి, సుమారు రూ.4 లక్షలకు విక్రయించాలని ఆరోపించారు. అధికారులు వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ చెట్లు తొలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అక్కడ ప్రభుత్వ అస్తులు కాజేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వం, నాయకులు భీమిరెడ్డి గోవింద, అయ్యప్ప, శ్రీను పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

మాకవరపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ల్యాండ్ సీలింగ్ భూమి కబ్జా చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు లాలం రాము, రుత్తల నాని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాకవరపాలెం బీసీ కాలనీకి ఆనుకుని 47/ఎ, 47/బి,47/సి, 47/డి సర్వే నంబర్లలో సుమారు నాలుగు ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూమిని వైసీపీ నాయకులు భూమిని ఆక్రమించారని ఆరోపించారు. దీనిపై పలు మార్లు ఫిర్యాదులు చేయగా ప్రభుత్వం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిందని, తర్వాత వాటిని తొలగించారని చెప్పారు. పూర్వం ఈ భూమి చేవ్వేటి రాజులమ్మ, గెంచి అప్పన్న, ఈరెల్లి నూకరాజు, రుత్తల రామయ్యమ్మకు ల్యాండ్ సీలింగ్‌లో పట్టాలు మంజూరు చేశారన్నారు. ఇటీవల జరిగిన రీ సర్వేలో కూడా ఈ భూమి వారి పేర్లు మీద ఆన్‌లైన్ ఉందన్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

తామరం పీఏసీఎస్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

మాకవరపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు శీరంరెడ్డి నాగవెంకటచినబాబు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు డైరెక్టర్లు అడిగర్ల రాంబాబు, శంకరరావు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో భూషణం, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, నాయకులు అల్లు రామునాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు మర్రినాయుడు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు



అప్పారావు (ఫైల్)

రావికమతం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అద్దిపల్లి అప్పారావు (70) కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రఘువర్మ శుక్రవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి తన తండ్రి కనబడలేదని, ఇంటి నుంచి వెళ్లే సమయంలో తెల్ల లాల్చి, హాఫ్ నిక్కర్ ధరించారని వృద్ధుడు కుమారుడు అప్పలనాయుడు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ఫొటోలోని ఉన్న వ్యక్తిని గుర్తిస్తే 9440904214 నంబరుకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలని ఆయన కోరారు.

రూ.500 కోట్లతో దేవాలయాల పునర్నిర్మాణం

» మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


కప్పస్తంభం వద్ద మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రూ.500 కోట్లతో పలు దేవాలయాల పునర్నిర్మాణం చేపడుతున్నామని దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ త్వరలో అన్ని దేవాలయాలకు పాలకమండళ్లను నియమిస్తామని, దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కమిషనర్ విడుదల చేశారన్నారు. దేవదాయ శాఖలో ఇన్‌చార్జిల పాలనకు త్వరలోనే ముగింపు పలుకుతామని, దానికి అనుగుణంగా శాఖలో ఖాళీలు, పదోన్నతులు, రూల్ పొజిషన్, కేడర్ స్ట్రెంగ్త్ వంటి అంశాలపై అధ్యయనం జరుగుతోందన్నారు. దేవాలయాల భద్రతలో మార్పులు తీసుకువస్తున్నామని, త్వరలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. చందనోత్సవం సమయంలో గోడ కూలిన ప్రాంతంలోని మెట్లను తక్షణమే పునరుద్ధరించాలని ఈఓను ఆదేశించారు. అంతకుముందు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఆహ్వానం పలికారు. గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. కప్పస్తంభం ఆలింగనం, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు చేశారు. మంత్రిని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, ఏసీ అన్నపూర్ణ, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈఓ శోభారాణి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక


జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

చోడవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీ నుంచి విజయవాడలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. స్థానిక క్రీడాకారులు చుక్కల లాస్య, బీవీ శశివర్ధన్, ఎం.రవిచంద్ర, రిషితాంజలి, బి. పర్ణిక ఆరోహి, కేశవర్ధన్, శరణ్య, ఇషితాశారద, సబీనా అజ్మీలు ఎంపికయ్యారు. విశాఖ నగరం ఆరిలోవ సహస్ర స్పోర్ట్స్ అకాడమీకి చెందిన తన్విత్, కారుణ్య, ధనుష్, దక్షితరెడ్డి, రుద్రాక్షరెడ్డి, రాఘవలు పోటీలకు అర్హత సాధించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన భరద్వాజ్, కార్తీక, జాహ్నవి, జయశ్రీలు ఈ పోటీలకు ఎంపికయ్యారు. కోచ్‌లుగా కె.ప్రదీప్‌కుమార్, గండి శేఖర్‌బాబు పాల్గొంటున్నారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు టి. హర్షవర్ధన్ ప్రసాద్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ అభినందించారు. క్రీడాకారులు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎస్పీని కలిసిన ప్రొబేషనరీ ఎస్ఐలు


ఎస్పీ తుహిన్ సిన్హాకు మొక్కను అందిస్తున్న ప్రొబేషనరీ ఎస్ఐలు

అనకాపల్లి రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకొని జిల్లాకు కేటాయించిన ప్రొబేషనరీ ఎస్ఐలు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్‌సిన్హాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సేవా దృక్పథంతో పాటు నీతినిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. శిక్షణలో పొందిన అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కేసుల దర్యాప్తులో ముందుండాలన్నారు. ఎస్పీని కలిసిన వారిలో కె.పోషణగౌరి, ఎన్.విజయకుమారి, షేక్ షాహిబా అంజుమ్, జి.కమల భార్గవ్ ఉన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో రైళ్ల పాక్షిక రద్దు, గమ్యాల కుదింపు నిర్ణయం కొనసాగుతోంది. ఈ నెల 29 వరకు కిరండూల్ రైళ్లను రద్దు చేయడంతోపాటు గమ్యాలను కుదించి కొరాపుట్ వరకే నడిపిస్తామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 26, 27 తేదీల్లో విశాఖలో, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 27, 28లలో కొరాపుట్‌లో బయలుదేరుతాయి. అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈనెల 27, 28 తేదీల్లో విశాఖలో, ఇదే రైలు తిరుగు ప్రయాణంలో ఈ నెల 27, 28 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరుతాయి. ఈ సర్వీసులను కిరండూల్-కొరాపుట్ మధ్య రద్దు చేశారు.

రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

» చెర్లోపలి ఖండం లేఅవుట్‌కు క్యాబినెట్ ఆమోదం హర్షణీయం
» మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న చెర్లోపలి ఖండం లేఅవుట్ సమస్య పరిష్కారానికి రాష్ట్ర మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అభినందనీయమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2006వ సంవత్సరంలో 78 మంది చిన్న, సన్నకారు రైతుల నుంచి అప్పటి వుడా అధికారులు 58 ఎకరాల భూమిని అభివృద్ధి కోసం తీసుకున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి అగ్రిమెంట్లు కూడా జరిగాయన్నారు. 2016లో సుమారు రూ.6 కోట్లు ఖర్చు చేసి రహదారులు, డ్రైనేజీ కాలువలు నిర్మించారన్నారు. అయితే 2017లో అప్పటి ఐఏఎస్ అధికారి ఒకరు లేఅవుట్ అభివృద్ధి విషయంలో రైతులకు, వీఎంఆర్‌డీఏకు మధ్య జరిగిన ఒప్పందానికి విరుద్ధంగా వ్యతిరేకంగా వ్యవహరించారని ఆరోపించారు. అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వకపోవడంతో భూమి ఇచ్చిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులతో నాటి కలెక్టర్ మల్లికార్జునను కలిసి సమస్యను వివరించానన్నారు. ఈ లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తే వీఎంఆర్‌డీఏకు అధిక ఆదాయం వస్తుందని చెప్పగా, కలెక్టర్ ఈ విషయాన్నిఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ఈ ప్రాజెక్టు విషయమై ఇటీవల వీఎంఆర్‌డీఏ వైస్‌చైర్మన్ కేఎస్ విశ్వనాథన్‌తో మాట్లాడగా, ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. దీంతో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చి, చెర్లోపలి ఖండం లేఅవుట్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్లియరెన్స్ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వీఎంఆర్‌డీఏ అధికారులు త్వరగా టెండర్లు పిలిచి పనులను ప్రారంభించాలని ఆయన కోరారు. చెర్లోపలి లేఅవుట్‌కు సంబంధించి సమగ్ర విచారణ చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని దాడి డిమాండ్ చేశారు.

అవినీతితో ఆర్థిక వ్యవస్థకు దెబ్బ

» పౌర సేవల డిజిటలైజేషన్‌తో అవినీతి తగ్గుతుంది
» రాష్ట్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్


తమ్మిరెడ్డి శివశంకర్‌ను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో అవినీతిని నియంత్రించకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి న్యూకాలనీలోని రోటరీ హాల్‌లో జరిగిన 'సమాజ అభివృద్ధి, అవినీతి నియంత్రణ' అనే అంశం పై ఆయన మాట్లాడారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆచరణలో ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుందని, వీటిల్లో ఏ ఒక్కటి గాడి తప్పినా సమాజం ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పౌర సేవల డిజిటలైజేషన్‌తో అవినీతి తగ్గుతుందని, అవినీతి నియంత్రణతో సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని చెప్పారు. అవినీతిరహిత వ్యవస్థతో న్యాయం త్వరగా లభిస్తుందని, ప్రతి పౌరుడు అవినీతి నిరోధకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకుంటే ప్రభుత్వ శాఖల్లో అవినీతి తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. యువతలో నైతిక విలువలు పెంపొందాలని, అవినీతి నియంత్రణకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి కేవీపీఎస్ ప్రకాశరావు, కోశాధికారి బి. సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

రూ.69 కోట్లతో పెద్దేరు ఆధునికీకరణ

» డిసెంబరు లో పనులు ప్రారంభం
» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


చీడికాడ మండలం కోనాం మెయిన్ గేటు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తదితరులు

మాడుగుల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెన్నేటి విశ్వనాథం జలాశయం (పెద్దేరు) రిజర్వాయర్ ఆధునికీకరణకు రూ.69 కోట్లు మంజూరయ్యాయని శాసనసభ్యుడు బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం పెద్దేరు జలాశయం వద్ద జలహారతి ఇచ్చిన తర్వాత సాగునీటిని ఆయన విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో బండారు మాట్లాడుతూ, డిసెంబరు నుంచి పెద్దేరు ఆధునికీకరణ పనులు ప్రారంభించి వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఖరీఫ్‌లో కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించేలా కలెక్టర్‌తో మాట్లాడానని తెలిపారు. అలాగే తాటిపర్తి జలాశయం ఆధునికీకరణ పనులకు రూ.16కోట్లు అవసరమని గుర్తించామని, ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడడం జరిగిందన్నారు. ఉరకగెడ్డ రిజర్వాయర్‌లో ఇన్‌ఫ్లో అధికంగా ఉన్నప్పటికీ భూ సమస్య కారణంగా సాగునీరు వదలడంలో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, ఎంపీపీ రాజారాం, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయ కమిటీ చైర్మన్ అద్దెపల్లి జగ్గారావు, వైస్ చైర్మన్ ఆర్లి గోవింద, జలాశయం ఈఈ ఎ.త్రినాథం, డీఈ చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి : బండారు

చీడికాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోనాం పాలవెల్లి జలాశయం నుంచి విడుదల చేసిన సాగునీటిని రైతులంతా పొదుపుగా వాడుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. శుక్రవారం మండలంలోని కోనాం జలాశయం నుంచి సాగునీటిని ఎగువ, దిగువ కాలువలకు ఎమ్మెల్యే విడుదల చేశారు. తొలుత నీటిపారుదల శాఖ ఈఈ ఎ.త్రినాథం, కోనాం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల చిన్నంనాయుడు, ఉత్తమ మహిళలైన పోతల రమణమ్మ, కుచ్చు కళావతి, కసిరెడ్డి భాగ్యలక్ష్మిలతో కలిసి గేట్లకు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ సత్యనారాయణదొర, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పంచాడ దాలెంనాయుడు, టీడీపీ నాయకులు గవిరెడ్డి జగన్నాథం, దారపు పెద్దినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు నిధులతో గ్రామీణ రోడ్ల అభివృద్ధి

పరవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామీణ రహదారుల అభివృద్ధికి మోక్షం కలిగింది. నాబార్డు నిధులు రూ.2.2 కోట్లతో మూడు ప్రధాన రహదారుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వాడచీపురుపల్లి నుంచి వెంకటాపురం వెళ్లే రహదారికి రూ.60 లక్షలు, కలపాక నుంచి గొల్లలపాలెం వెళ్లే రోడ్డుకు రూ.80 లక్షలు, స్వయంభూవరం నుంచి సోమినాయుడుపాలెం వెళ్లే ప్రధాన రహదారికి రూ.80 లక్షల చొప్పున నాబార్డు నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఏఈ కుమార్‌రాజా శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శనివారం ఈ పనులకు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. ఈ రహదారుల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు వెలువడడంతో స్పందించిన ఎమ్మెల్యే.. ఉన్నతాధికారులతో మాట్లాడి, నాబార్డు నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు.

పట్టాలెక్కనున్న మెట్రో రైలు ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

వస్తుంది. వీటన్నింటికి అంచనా వ్యయం రూ.6,250 కోట్లు. దీనికి జీఎస్టీ అదనం. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ పనులు ప్రాంభించిన తేదీ నుంచి 24 నెలల్లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. 30 నెలల్లో మొత్తం కారిడార్లు పూర్తిచేసి ఇవ్వాలి. ఈ మూడు కారిడార్లలో 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లను నిర్మిస్తారు. ఈ నెల 28వ తేదీ నుంచే వెబ్‌సైట్‌లో టెండర్ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆగస్టు 12వ తేదీన టెండర్లు వేసిన వారితో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి, సందేహాలు నివృత్తి చేస్తారు. సెప్టెంబరు 5వ తేదీ నుంచి పూర్తిచేసిన టెండర్ల స్వీకారం మొదలవుతుంది. అదే నెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకూ టెండర్లను స్వీకరించి, 3.30 గంటలకు టెండర్లను తెరిచి కాంట్రాక్టు ఎవరికి దక్కిందో ప్రకటిస్తారని ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

రూ.1.29 కోట్ల బంగారం, వజ్రాలతో ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు చూపుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.1.29 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాల (డైమండ్స్)తో పరారైన ఓ డైమండ్ షోరూమ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు మరొకరిని అరెస్టు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన ముదపాక జేజి (49) హైదరాబాద్‌కు చెందిన క్రిష్ డైమండ్ షోరూమ్‌లో ఆరు నెలల క్రితం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. షోరూమ్‌లోని డైమండ్, బంగారు ఆభరణాల మోడల్స్‌ను విశాఖలోని వివిధ గోల్డ్ షోరూమ్‌లలో చూపించేందుకు అదే సంస్థలో పనిచేస్తున్న బొగ్గు వంశీ అనే మరో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో కలసి ఈ నెల మూడో తేదీన విశాఖపట్నం వచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హోటల్‌లో గది తీసుకొని ఇద్దరూ బస చేశారు. ఆరోజు వివిధ షోరూమ్‌లలో ఆభరణాల మోడల్స్ చూపించి తిరిగి తీసుకువచ్చారు. మరుసటిరోజు తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో తనతో పాటు వచ్చిన వంశీ నిద్రిస్తున్న సమయంలో ముదపాక జేజి ఆభరణాల బ్యాగ్‌తో పరారయ్యాడు. నిద్ర నుంచి లేచి చూసిన వంశీకి జేజితో పాటు ఆభరణాల బ్యాగ్ కనిపించలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలించి బ్యాగ్‌తో పరారైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు బ్యాగ్‌తో కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీచేశారు. ఆభరణాలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకరు ముదపాక జేజి కాగా మరొకరి పేరు ఆకుల సత్యనారాయణ. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.1,29,48,154 విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ బాగ్చి పేర్కొన్నారు.

క్రైం... crime news

కారు ఢీకొని మహిళా కూలీ మృతి


దాసరి లక్ష్మి (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీ పరిధిలోని యర్రవరం వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ సావిత్రి వెల్లడించిన వివరాలిలా వున్నాయి. మునిసిపాలిటీలోని పెదపల్లికి చెందిన దాసరి లక్ష్మి(40) మర్రిబంద సమీపంలోని ఇటుకల పరిశ్రమలో కూలీగా పనిచేస్తున్నది. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి ఇటుకల పరిశ్రమకు జాతీయ రహదారి పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్నది. ఈ క్రమంలో యర్రవరం పెట్రోలు బంకు సమీపంలో అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న కారు.. లక్ష్మిని వెనుక నుంచి బలంగా ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఇటుకబట్టీ కార్మికురాలి మృతి


మృతిచెందిన కళావతి

కశింకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయ రహదారి దాటుతున్న మహిళను వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఒడిశా రాష్ట్రం జయపూర్‌కు చెందిన కళావతి (54), మరో ముగ్గురు ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లిలో ఉన్న ఇటుక బట్టీలో పని చేసేందుకు గత నెలలో వచ్చారు. అయితే గురువారం రాత్రి 10 గంటల సమయంలో కళావతితోపాటు మరో ఇద్దరు కలిసి జయపూర్ వెళ్లడానికి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కశింకోట కూడలి వద్ద కళావతి రోడ్డుకు ఎడమ వైపు నుంచి కుడివైపునకు వెళుతుండగా వ్యాన్ ఢీకొన్నది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహానికి అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇటుక బట్టీ యజమాని మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు.

బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

అచ్యుతాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి. మండలంలోని కొనెంపాలెం వద్ద గల ఒక హోటల్‌లో తల్లితోపాటు ఆమె మైనర్ కుమార్తె పనిచేస్తున్నారు. హోటల్ యజమాని సమీపంలోని ఒక ఇంట్లో అద్దెకుంటున్నాడు. సెజ్‌లోని ఒక కర్మాగారంలో పనిచేస్తున్న ముస్తఫా అనే వ్యక్తి భోజనం, అల్పాహారం చేయడానికి ఈ హోటల్‌కు వస్తూ.. యజమానితో పరిచయం పెంచుకున్నాడు. కొన్నిసార్లు హోటల్ యజమాని ఇంట్లోనే వుంటుంటాడు. ఈ నేపథ్యంలో హోటల్ యజమాని ఇంటిని శుభ్రం చేయడానికి బాలిక వెళ్లింది. దీనిని గమనించిన ముస్తఫా.. తన సెల్‌ఫోన్‌కు ఇంట్లో చార్జింగ్ పెట్టానని, వెళ్లి తెచ్చుకుంటానని హోటల్ యజమానికి చెప్పాడు. అనంతరం ఇంటికి వెళ్లిన అతను.. ఇల్లు శుభ్రం చేస్తున్న బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయంగా పెద్దగా అరుస్తూ బయటకు వచ్చి తల్లికి ఈ విషయాన్ని చెప్పింది. శుక్రవారం బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముస్తఫాపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని, నిందితుడు పరారీలో వున్నాడని సీఐ చెప్పారు.

జీవితంలో భాగంగా ఏఐ

» ఫ్యూజన్ ఏఐ సదస్సులో ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది జీవితంలో భాగంగా మారిపోయిందని, అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తోందని ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటైన 'ఫ్యూజన్ ఏఐ సదస్సు'ను మంత్రి శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏఐ వినియోగం వల్ల ఉత్పత్తి వ్యయం, మానవ వనరుల అవసరం తగ్గుతున్నదని చెప్పారు. ఏఐ వల్ల భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు పోతాయని ప్రచారం జరుగుతోందని, కానీ అంతకు మించిన అవకాశాలు లభిస్తాయన్నారు. సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటికి సాంకేతికత సాయంతో పరిష్కారాలు కనుగొనేందుకు ఆలోచించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వచ్చే సందేహాలను వెబ్‌సైట్‌లో ఏఐ, చాట్ జీపీటీ ద్వారా తమ శాఖ నివృత్తి చేస్తోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చేయడానికి విశాఖపట్నం అనుకూలమైన నగరమని ఎన్‌విడియా దక్షిణ ఆసియా ఎండీ విశాల్ ధూపర్ అన్నారు. పరిశ్రమలను మరో స్థాయికి తీసుకువెళ్లడానికి ఆంధ్రప్రదేశ్‌కు ఏఐ ఒక చక్కటి అవకాశమని ఏపీఎన్‌ఆర్‌టీ అధ్యక్షులు వేమూరి రవి అన్నారు. ఏఐకు భయపడకూడదని, దానిని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలన్నారు. డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ, ఏఐ విప్లవాన్ని ప్రారంభించడానికి భారతదేశం ఒక వేదికగా మారిందని, విశాఖపట్నం అందులో కీలకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీపీఐ డైరెక్టర్ సురేశ్ బాతా తదితరులు ప్రసంగించారు.

శరవేగంగా..

... 5వ పేజీ తరువాయి

గ్రామాల్లో సభలు నిర్వహించి.. టీడీఆర్ బాండ్లకు భవిష్యత్తులో లభించే డిమాండ్ గురించి వివరించారు. దీంతో టీడీఆర్ బాండ్లు తీసుకోవడానికి నిర్వాసితుల్లో అత్యధికులు సుముఖత వ్యక్తం చేశారు. కొందరు మాత్రమే అభ్యంతరం తెలిపారు. కాగా జిరాయితీ, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ స్థలాల్లో కట్టడాలకు నగదు రూపంలో నష్టపరిహారాన్ని అందిస్తుండడంతో నిర్వాసితులు ఊరట చెందుతున్నారు. అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తొలగిపోయి, ఎలమంచిలి నియోజకవర్గం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469